క్లుప్తంగా

సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నీకి విద్యార్థి ఎంపిక



మరికల్: ఆల్ ఇండియా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు సరస్వతి డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యారు. సౌత్‌జోన్ టోర్నీకి ఎంపికైన అశోక్‌కుమార్‌ను గురువారం కళాశాల కరస్పాండెంట్ రాములు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. పాలమూరు యూనివర్సిటీ టీమ్ నుంచి సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలో ఆడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీదేవి, గౌరిశంకర్, లక్ష్మికాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



మరికల్: చిన్నచింతకుంట మండలం అమ్మపూర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మరికల్ జట్టు మొదటి విజేతగా నిలిచింది. పదిరోజుల నుంచి గాయకుడు సాయిచంద్ జ్ఞాపకార్థకంగా నిర్వహించిన గురువారం ఈ పోటీలో విజేతగా నిలిచిన మరికల్ జట్టుకు రూ. 40 వేలు, రెండోస్థానంలో నిలిచిన దుప్పల్లి జట్టుకు రూ. 20వేలు షీల్డ్‌లను నిర్వాహకులు అందజేశారు.

రేపటి నుంచి చిల్డ్రన్స్ క్రికెట్ టోర్నమెంట్

నారాయణపేట రూరల్: జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 14 జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించే క్రికెట్ పోటీలు ఈ నెల 11నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు చిన్న తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరకు పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలు సంబంధిత ప్రిన్సిపాల్ అనుమతి పత్రంతో పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. అదేరోజు సాయంత్రం మినీస్టేడియం గ్రౌండ్‌లో డ్రా తీసి మ్యాచ్‌ల వివరాలు తెలియజేస్తామన్నారు. వివరాలకు 9032774303 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

అకాల వర్షాలకు తీరని నష్టం



మరికల్: మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చేతికి వచ్చిన వరి పంటలు నేలకొరిగి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. సాయంత్రం వరకు జాడలేని వరుణుడు రాత్రికి పెద్ద ఎత్తున కురవడంతో వరి పంటలు నేలకొరగడంతో పాటుగా కోతలుకోసి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ల ముందే నేలకొరగడంతో కొందరు రైతు లు కంటతడి పెట్టారు. ధాన్యం తడిసి ఎక్కడ మొలకెత్తుతుందోనని రైతులు వాపోతున్నారు.

జిల్లా స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



అజయ్

ధన్వాడ: ఈ నెల 10 నుంచి 12వరకు మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియంలో నిర్వహిస్తున్న 67వ అంతర్ జిల్లా పాఠశాల అండర్ 19 హ్యాండ్‌బాల్ పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరుపున ధన్వాడ మండలంలోని కొండాపూర్‌లో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల సెంకడియర్ విద్యార్థి అజయ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. ఈ మేరకు.. వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌రావు నాగమణి, కోచ్ రామ్మోహన్‌గౌడ్, పీఈటీ సుగుణాకర్, సంతోష్ ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

మరోసారి ఆశీర్వదించండి

నారాయణపేట/దామరగిద్ద/మక్తల్: నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశానని.. మరోసారి ప్రజలు తనను ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కోయిలకొండ మండలంలోని మోదీపూర్‌లో ఆంజనేయస్వామిఆలయంలో పూజలు చేశారు. అలాగే దామరగిద్దలోవీరభద్రేశ్వరస్వామికి పూజలుచేసి అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. అలాగే మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని ప్రజలు తనను ఆశీర్వదించాలని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మక్తల్‌లో నామినేషన్ వేసేందుకు భారీగా కాన్వాయ్‌లతో వెళ్లారు. అంతకుముందు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు.

సాగునీటికి కటకట

- భీమానది తీర ప్రాంత రైతుల ఇక్కట్లు
- వేసవిలో మరింత తీవ్రమవుతున్న ఎద్దడి
- డెల్టా ప్రాంతాల్లో చిన్నపాటి ఆనకట్టలు నిర్మిస్తే ఉపయోగం



భీమానదిలో నీటిజాడ లేని పరిస్థితి

కృష్ణా: మండలంలోని సూకూర్ లింగంపల్లి, కుసుమర్తి, తంగిడి గ్రామాల పక్కన ప్రహిస్తున్న భీమానదిపై ప్రభుత్వం చెక్‌డ్యాంలను కానీ, చిన్నపాటి ఆనకట్టలు నిర్మించినట్లయితే ఈ ప్రాంతంలోని ఎత్తిపోతల పథకాలతోపాటూ భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని ప్రాంత రైతులు అభిప్రాయపడుతున్నారు. పైగా వేసవిలో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవని రైతులు అంటున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ఆలోచించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

డెల్టా ప్రాంతాలు అనుకూలం..

భీమానదిలో చాలా వరకు డెల్టా ప్రాంతాలు ఉన్నాయి. ఆ డెల్టా ప్రాంతాలు కూడా రెవెన్యూ రికార్డుల్లో పట్టభూములుగానే నమోదై ఉన్నాయి. నదిలోని రెండు గుట్టల మధ్య ఒకపాయ ఇటువైపు , మరోకటి అటు కర్ణాటక ప్రాంతంలో మరో పాయగా ప్రవహిస్తుంది. అటు కర్ణాటక ప్రాంతంలో నది పెద్దదిగాను ఇటువైపు గుట్టల మధ్య పాయా చిన్నదిగాను ఉంది. ఈ చిన్నపాయాకు రెండు గుట్టల మధ్య ప్రభుత్వం చిన్నపాటి ఆనకట్టలాంటింది నిర్మించినట్లయితే నదిలో పుష్కలంగా నీరునిల్వ ఉంచుకునేందుకు అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఈ డెల్టా ప్రాంతాలు ప్రకృతి సిద్ధంగా ఎత్తుగా ఉండడంతో నదిలోని నీరు ఇటువైపు నిల్వ ఉండకుండగా అటువైపు ఉన్న కర్ణాటక ప్రాంతంలో నీరు ప్రవహిస్తు ఉంటుంది. దీంతో ఈ ప్రాంత రైతులకు వేసవి సమయంలో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతాయి. ఈ సమస్యను అధిగమించేందుకు కేవలం ఏకైక మార్గం చెక్ డ్యాం లేదా ఆనకట్టలు కట్టడమేనని అంటున్నారు. ఈ సంవత్సరం సరైన వర్షాలు లేకపోవడం మూలంగా భీమానదిలో ఇప్పటికే నీరు లేకుండగా పోయింది.

తుక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు..

ఈ నదులపై ఎగువన ఉన్న కర్ణాటక ప్రభుత్వం ఎక్కడికక్కడ చిన్న, చిన్న బ్రిడ్జి కం బ్యారేజీలు, చెక్ డ్యాంలు నిర్మించి అక్కడి రైతులకు సాగు నీరు అందిస్తున్నది. అదే తరహాలో మన ప్రాంతంలో కూడా చిన్న, చిన్న చెక్‌డ్యాంలు నిర్మించడంతో సాగునీటికి ఉన్న ఇబ్బందులు తొలగడంతోపాటు తాగునీటి అవసరాలకు నీటిని ఉపయో గించుకోవచ్చు. పైగా అతితక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు, ప్రయోజనాలున్నాయని, ఈ విషయంపై ప్రభుత్వం ఆలోచించి తగిన నిర్ణయం తీసుకుంటే తమ బతుకులు మారిపోతాయని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు.



చెక్‌డ్యాంలు నిర్మిస్తేనే..



మా ప్రాంతంలోని కృష్ణానదిలోని డెల్టా ప్రాంతాల్లో చెక్‌డ్యాంలను నిర్మిస్తే మాకు సాగునీరు అందుతుంది. ముఖ్యంగా వేసవిలో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ఈ విషయంపై ప్రభుత్వం ఒకసారి ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలి.

– దేవేంద్రప్ప, రైతు కుసుమర్తి

ప్రభుత్వం చొరవ చూపాలి..



కృష్ణానదిలో ప్రకృతి సిద్ధంగా ఉన్న ఏర్పడ్డ డెల్టా ప్రాంతాల్లో నీటిని దిగువకు వెళ్లనీయకుండగా ఆపుకునేందుకు ఏ అవకాశం ఉన్న వాటిని ఉపయోగించుకోవాలి. ఉపాధిహామీ పథకంలో చిన్నపాటి ఆనకట్టలు కట్టేందుకు కృషి చేయాలి.

–సాలె రామన్న, రైతు, కుసుమర్తి

కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో గురువారం ఏపీఎం విజయకుమారి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండించిన వరిని దళారులను నమ్మి ఎక్కడపడితే అక్కడ విక్రయించరాదని ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కేశవులు, భద్రునాయక్,భేఈఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చాటాలి



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, ఈఎంఆర్‌ఎస్ ట్రైబల్ వెల్ఫేర్ మాజీ క్రీడల అధికారి రమేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో 2వ జలజం సత్య నారాయణ ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ కొనసాగుతుంది. గురువారం పాఠశాలల క్రీడాజట్లను రమేష్ కుమార్ పరిచయం చేసుకుని మాట్లాడారు. పట్టుదలతో ఆడితే క్రీడల్లో విజయం సాధించవచ్చని అన్నారు. నిరంతరం క్రీడలను సాధన చేస్తే నైపుణ్యంగల క్రీడాకారుడిగా ఎదుగుతారని సూచించారు. నాల్గవ రోజు మ్యాచుల్లో గెలాక్సీ హైస్కూల్ జట్టు 7 వికెట్ల తేడాతో లుంబిని స్కూల్ జట్టుపై, షాసాబ్‌గుట్ట పాఠశాల జట్టు 4 పరుగుల తేడాతో గీతశ్రీ స్కూల్ జట్టుపై, సెయింట్ ఆగ్నెస్ జట్టు 17 పరుగుల తేడాతో ఢిల్లీ ఒలింపియాడ్ జట్టుపై, ఉదయ మెమోరియల్ స్కూల్ జట్టు 15 పరుగుల తేడాతో శ్రీస్తూ జ్యోతి విద్యాలయం జట్టుపై, లిటిల్ స్కాలర్ పాఠశాల జట్టు 7 వికెట్ల తేడాతో అపెక్స్ స్కూల్ జట్టుపై, న్యూటౌన్ స్కూల్ జట్టు ఒక పరుగు తేడాతో జ్ఞానభారతి స్కూల్ జట్టుపై, సెయింట్ ఆగ్నేస్ జట్టు 55 పరుగుల తేడాతో కృష్ణవేణి స్కూల్ జట్టుపై గెలుపొందాయి. కార్యక్రమంలో పీడీ బాల్‌రాజు, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



మూలమలుపు వద్ద ప్రమాదకరంగా గుంత

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లి సమీపంలో ములమలుపు వద్ద జియోట్యాగ్ కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారిందని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ములమలుపు వద్ద అసంపూర్తిగా పనులు చేయడంతో రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు ఆ గుంతలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని సంబధిత అధికారులు పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి పూర్తిస్థాయిలో పనులు నిర్వహించాలని కోరుతున్నారు.

రోడ్డు నిబంధనలు పట్టవా?



మరికల్: రోడ్డు నిబంధనలు తప్పనిసరి అంటూ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కొందరు పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ముఖ్యంగా పలు గ్రామాలకు బస్సుసౌకర్యం లేని కారణంగా ఆటోలు, జీపులో ఎక్కువమందిని తరలిస్తూ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఒక ఆటోలో నిబంధనల ప్రకారం ఆరు మంది ప్రయాణించాల్సి ఉంటుంది. కానీ ఒకే ఆటోలో 15నుంచి 20మందిని తరలిస్తున్నారు. దీంతో అనుకొని ప్రమాదం జరిగితే భారీప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులోని జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన విజయమోహన్‌రెడ్డి భార్యతో కలిసి కారులో కర్నూల్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొమిరెడ్డిపల్లి దాటిన తర్వాత మలుపు వద్ద కారు అదుపు తప్పి డివైడర్ మీదుగా హైదరాబాద్ వెళ్లే పక్క రోడ్డు మీదకు దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై వెళ్తున్న లారీ కారుకు తగలడంతో కారు మళ్లీ డివైడర్ మీదకు వచ్చి ఆగిపోయింది. అందులో ఉన్న విజయమోహన్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఎల్‌అండ్‌టీ అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి అక్కడే ప్రథమ చికిత్స చేశారు. తర్వాత కారును అక్కడే వదిలేసి వారిద్దరు టోల్‌గేట్ వద్ద బస్సులో కర్నూల్‌కు వెళ్లిపోయారు.

ఇద్దరికి గాయాలు

జడ్చర్ల టౌన్: మండలంలోని బూరెడ్డిపల్లి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. దాసరిపల్లికి చెందిన అంజిరెడ్డి, బాలన్నలు ద్విచక్రవాహనంపై భూత్పూర్ నుంచి జడ్చర్లకు వస్తుండగా గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. గాయపడిన ఇద్దరిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



కొమిరెడ్డిపల్లి వద్ద ప్రమాదానికి గురైన కారు

బీఆర్‌ఎస్‌లో చేరిక..

నారాయణపేట: పట్టణంలోని పదోవార్డులో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, బీఆర్‌ఎస్ యువనాయకుడు శ్రీపాద్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరడంతో వారికి కండువాలు కప్పి స్వాగతించారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

మరికల్/దామరగిద్ద/మద్దూరు: మరికల్ మండలంలోని గురువారం ఆయాగ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీలను నేరవేరస్తామన్నారు. అలాగే మద్దూర్‌లోని దోరేపల్లి బీఆర్‌ఎస్ ఎంపీటీసీ చిన్నమ్మ, మాజీ ఎంపీటీసీ సీతాబాయి, బీఆర్ ఎస్ నాయకుడు అనిల్‌నాయక్ గురువారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. దామరగిద్ద మండల కేంద్రంలోని గురువారం కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

బీజేపీలో చేరిక..

నారాయణపేట రూరల్: పట్టణంలోని 20వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్లు గీతాబాయి, బాలాజి మాండ్రెలు గురువారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నాగురావునా మాజీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మక్తల్: నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలందర్‌రెడ్డిని గెలిపించాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య కార్యకర్తలకు సూచించారు. గురువారం పట్టణంలోని ఆయా గ్రామాల్లో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



మాగనూర్: మండల పరిధిలోని నేరడగంలో మక్తల్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. జన సంచార ప్రాంతం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు ముళ్లపొదలు ఉండటంతో అటుగా వెళ్లే ప్రజలకు అది కనిపించడం లేదు. దీంతో ప్రాణనష్టం సంభవించే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరుతున్నారు.

మూణ్నాళ్ల ముచ్చటేనా..?



మండల కేంద్రంలో రోడ్డు వెడల్పులో భాగంగా మాగనూర్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డు మధ్యలో వేసిన బటర్‌ఫ్లై బల్బులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. గతంలో మాగనూర్ జాతర ప్రారంభం సందర్భంగా హడావుడిగా ప్రారంభించి విద్యుత్ మీటర్ లేదనే నెపంతో అధికారులు సరఫరా బంద్ చేయడంతో చీకటిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– మాగనూర్

వంతెన లేక అవస్థలు



వంతెన లేకపోవడంతో ఆటోను తోసుకొస్తున్న ప్రయాణికులు

మాగనూర్: మండల పరిధిలోని గజ్జరందొడ్డి పెద్ద వాగుపై వంతెన లేకపోవడంతో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా ఈ మార్గం నుంచి మక్తల్ పట్టణానికి కొల్పూర్, మందిపల్లి, గజ్జరందొడ్డి గ్రామాల ప్రజలు నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణం సాగిస్తుంటారు. అయితే వర్షాకాలం అయితే పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుందని దీంతో నెలల తరబడి ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాపోతున్నారు. మందిపల్లినుంచి మక్తల్‌కు వాడ్వట్ మీదుగా వెళ్లేందుకు బీటీరోడ్డు ఉన్న చాలా దూరం ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణించడానికి ప్రజలు ఎక్కువగా అసక్తి చూపుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మహాసభను విజయవంతం చేయాలి



మహాసభ కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో 11న నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి నర్సింహ కోరారు. గురువారం మండలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వరూప మహాసభకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హన్మంతు, నాయకుడు దశరథ్, శ్రీనివాస్, అశోక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తికి తరలివస్తున్న వ్యాపారులు



కురుమూర్తి జాతర మైదానంలో ఏర్పడ్డ హోటళ్లు



జాతరమైదానంలో ఏర్పాటు చేస్తున్న రంగుల రాట్నాలు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14న ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలతోపాటు జాతర నెలరోజులపాటు వైభవంగా కొనసాగుతుంది. ఉత్సవాలను పురస్కరంచుకుని జాతర మైదానంలో వివిధ రకాల వ్యాపారాలు కొనసాగించేందుకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు తరలివస్తున్నారు. మైదానంలో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే రంగుల రాట్నాలు, సర్కస్, హోటళ్లు, ఆట వస్తువులు, మిఠాయి తదితర దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉద్దాల మహోత్సవం నాటికి జాతర మైదనంలో దుకాణ సముదాయాల ఏర్పాట్లు పూర్తి కానున్నాయి.

తిరుపతిలో గద్వాల చంద్రశేఖరరావు గానకచేరి

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుపతిలోని పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో జిల్లా కేంద్రానికి చెందిన సంగీత విద్వాంసుడు గద్వాల చంద్రశేఖరరావు కచేరి చేయనున్నారు. ఈ మేరకు ఆయనకు టీటీడీ దాససాహిత్యప్రాజెక్ట్ నుంచి ఆహ్వానం అందింది. తిరుచనూర్‌లో నిర్వహించే అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవా రం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు గద్వాల చంద్రశేఖరరావు సంకీర్తన గానం నిర్వహించనున్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తిరుపతిలో151 సార్లు గానం చేసినట్లు పేర్కొన్నారు. శ్రీవారి సన్నిధిలో గానం చేయడానికి అవకాశం వస్తుండడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు

నర్వ: జరగనున్న శాసనసభ ఎన్నికల్లో అధికార పార్టీ రూ.కోట్లు ఖర్చు చేసినా గెలిచేది బీజేపీనేనని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మక్తల్ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. గొల్ల కురుమ సోదరులు అయ్యలప్పతో పాటు నాయకులు, జంగంరెడ్డిపల్లి సర్పంచ్ బోయ రాములుతో పాటు నాయకులు, నర్వ, బెక్కర్‌పల్లి, ఎల్లంపల్లి, పెద్దకడ్మూర్, జంగంరెడ్డిపల్లి, కన్మనూర్, లంకాల్, పాతర్చేడ్ గ్రామాల నుంచి మహిళలు, యువకులు బీజేపీలో చేరగా వారికి జలంధర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర సర్కారు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆరు నెలల్లోనే పగుళ్లు ఏర్పడ్డాయన్నారు. రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ విజయదుందిభి మోగించినట్లే జరిగే ఈ ఎన్నికల్లో సైతం విజయం సాధించడం తథ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, నంగి దేవేందర్‌రెడ్డి, భాస్కర్, కర్నిస్వామి, బలరాంరెడ్డి, నరేందర్‌సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచ్ పెద్దింటి సంధ్య, లలితమ్మ, కుర్వ సత్యం, రాజశేఖర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, హన్మంతురెడ్డి, పెద్దింటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సబ్సిడీలు లేనట్లేనా?

- నకాలంలో మంజూరుకాని సబ్సిడీ స్ప్రింక్లర్లు



రాయపల్లి శివారులో వేరుశనగ సాగుచేస్తున్న వేరుశనగ పంట (ఫైల్)

రాజాపూర్: ప్రస్తుతం కూలీల కొరతతో పాటు పెట్టుబడి ఖర్చులు అధికమవ్వడంతో అన్నదాతలు ప్రత్యామ్నాయ పద్ధతులను ఆలోచిస్తున్నారు. గతంలో రైతులకు బిందు సేద్యం కోసం కావాల్సిన డ్రిప్ సిస్టం, స్ప్రింక్లర్లు, ట్రాక్టర్‌లతోపాటు వాటికి కావాల్సిన పరికరాలు ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, బీలకు, చిన్న, సన్నకారు రైతులకు 50 నుంచి 90 శాతం వరకు సబ్సిడీ ఇచ్చి రైతులను అన్ని విధాలుగా ఆదుకుని ప్రోత్సహించారు. ప్రస్తుతం రైతుబంధు ఇవ్వడంతో వీటన్నింటిని ఎత్తేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈసీజన్‌లో రైతులు ఎక్కువగా పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలను బిందు సేద్యం, తుంపర సేద్యంతో సాగు చేస్తుంటారు. ప్రస్తుతం 50శాతం సబ్సిడీపై స్ప్రింక్లర్లు తతదితర పరికరాలను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

పైపులు ప్రైవేట్‌లో తెచ్చుకున్నా



గతేడాది నుంచి స్ప్రింక్లర్ పైపుల కోసం వ్యవసాయశాఖ అధికారులను అడుగుతూనే ఉన్నా. ఇప్పుడు సబ్సిడీపై పైపులు వస్తలేవని చెప్పారు. కనీసం టార్పాలిన్లు అయినా ఉన్నాయ అంటే అవి కూడా లేవంటున్నారు. ఇప్పుడు పల్లీ సీజన్ వచ్చింది. రూ.వేలు ఖర్చుచేసి ఐదుగురు కలిసి స్ప్రింక్లర్ పైపులు తెచ్చుకున్నాం. సబ్సిడీపై ఇస్తే రైతులకు ఆసరాగా ఉండేది.

– దూళ్ల ఎర్రన్న, రైతు, రాయపల్లి

ఆయిల్‌పాంకే ఇస్తరంట..



కొన్నేళ్లుగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ఆశించిన మేరకు దిగుబడి రావడం లేదు. ఉన్న పొలంలో మామిడి తోటసాగు చేద్దామనుకున్నా. ప్రభుత్వం నుంచి డ్రిప్‌కు సబ్సిడీ వస్తదని అనుకుంటే డ్రిప్ కేవలం ఆయిల్‌ఫాం తోటలకు ఇస్తున్నారు. రైతులకు అవసరమున్న యాంత్రీకరణ వస్తువులను సబ్సిడీపై ఇస్తే బాగుంటుంది.

– వెంకట్‌రెడ్డి, రైతు, కల్లేపల్లి

రావడం లేదు..

2018 నుంచి స్ప్రింక్లర్లు రావడం లేదు. డ్రిప్ హార్టికల్చర్ వారు చూస్తున్నారు. టార్పాలిన్లు, స్ప్రింక్లర్లు రైతులు అడుగుతున్నారు. నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తూనే ఉన్నాం.

– నరేందర్, ఏఓ, రాజాపూర్